10-07-2025
గురువారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 47 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి

## ప్రధాని మోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం



**జయభేరి, న్యూ డిల్లీ జూలై 9 :**

ప్రధాని మోదీ నమీబియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం దక్కింది. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన ''ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్'' పురస్కారాన్ని అందుకున్నారు. నమీబియా ప్రెసిడెంట్ నెటుంబో నంది మోదీకి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ పురస్కారం పట్ల మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ప్రెసిడెంట్ నెటుంబో నందితో పాటు

...మిగతాది 2 లో

## తెలంగాణకు ఎరువుల కొరత తీరుస్తాం

- సీఎం రేవంత్ రెడ్డి వినతికి స్పందించిన కేంద్రం



**జయభేరి, న్యూ డిల్లీ, జూలై 9 :**

తెలంగాణ రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని విధాలా సహకారం అందిస్తామని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రానికి సరిపడా యూరియా, ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూలై, ఆగస్టు నెలల్లో యూరియాను నిరాటంకంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి పై స్పందించిన కేంద్ర మంత్రి నడ్డా రైతుల అవసరాలను తీర్చడానికి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణకు అవసరమైన మేరకు సరఫరా ఉండేలా చూసుకోవాలని ఎరువుల శాఖ అధికారులను ఆదేశించారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సమానంగా ఎరువులు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కోరారు.ఇదే సమయంలో తెలంగాణలో యూరియా వినియోగం పెరుగుతుండటంపై కేంద్ర మంత్రి నడ్డా ఆందోళన వ్యక్తం చేశారు. 2023 24 యాసంగితో పోలిస్తే 202425 యాసంగిలో యూరియా అమ్మకాలు 21% అధికమయ్యాయని అన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం ప్రణామ్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలు అందిస్తుందని ప్రస్తావించారు.



# దేవుడినైనా ఎదురించి నిలబడుతం

"కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ హక్కులను ఎవ్వరికీ తాకట్టు పెట్టం. ఎంతటి వారొచ్చినా నిటారుగా నిలబడి కొట్లాడుతం. దేవుడే ఎదురుగా వచ్చి నిలబడినా ఎదురించి ప్రజలకు అండగా నిలబడుతాం. తెలంగాణ ప్రజల్లో శాశ్వతంగా, గొప్పగా నిలిచిపోయే విధంగా మా విధానం ఉంటుంది. ప్రజల హక్కులను తాకట్టు పెట్టం.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.

2 లో

- కృష్ణా, గోదావరి జిలాల్లో తెలంగాణ హక్కుల విషయంలో ఎవ్వరూ అధైర్య పడొద్దు..

**జయభేరి, హైదరాబాద్ :**


"ప్రజలు ఒక విశ్వాసం, నమ్మకంతో మాకు అవకాశం ఇచ్చారు. తెలంగాణ ప్రజల హక్కుల విషయంలో దేవుడే వచ్చి ఎదురుగా నిలబడినా దేవుడినైనా ఎదురించి తెలంగాణ ప్రజల తరఫున నిలబడుతం. కృష్ణా, గోదావరి జిలాల్లో తెలంగాణ హక్కుల విషయంలో ఎవ్వరూ అధైర్య పడొద్దు.." అని భరోసానిచ్చారు.

కృష్ణా, గోదావరి నదీ జలాలు.. వినియోగం.. వివాదాలు అన్న అంశంపై జరిగిన, జరుగుతున్న పరిణామాలపై జ్యోతీరావు పూలె ప్రజా భవన్‌లో నీటి పారుదల శాఖ మంత్రి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లుతో పాటు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు. కృష్ణా జలాలపై గత ప్రభుత్వంలో జరిగిన పరిణామాలతో పాటు ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు ప్రాధాన్యత, దాన్ని తర్వాత క్రమంలో తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు స్థల మార్పు, తదనంతర పరిణామాలపై మంత్రి మరో ప్రజెంటేషన్ రూపంలో సమగ్రంగా వివరించారు. మేడిగడ్డలో నీటిని నిలువ చేస్తే ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలోని అంశాలను విడమరిచి చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో జరిగిన, జరుగుతున్న పరిణామాలపై శాసనసభలో అర్థవంతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. నదీ జలాల కేటాయింపుల్లో తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై పాలసీ డాక్యుమెంట్‌ను సభ ముందు అందజేస్తామని చెప్పారు. స్పీకర్ అనుమతితో నీటి

...మిగతాది 2 లో

## త్వరలో రిటైర్ అయిపోతానన్న అమిత్ షా

**జయభేరి, న్యూ డిల్లీ జూలై 9 :**



అమిత్ షా. కేంద్ర హోం శాఖ మంత్రి. ఆయన గురించి అందరికీ తెలిసిందే. గతంలో గుజరాత్ రాష్ట్ర హోం శాఖ మంత్రిగా, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ సీఎంగా పనిచేశారు. ఈ ద్వయం 2014 నుంచి కేంద్రంలో ప్రధానిహోం శాఖ మంత్రులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం 60 ఏళ్ల వయసులో ఉన్న అమిత్ షాపై తరచుగా ఒక ప్రచారం జరుగుతోంది. ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ రిటైర్ అయితే..(అంటే.. 75 ఏళ్ల వయసు వస్తే) ఆతర్వాత ప్రధాని అయ్యేది అమిత్ షానేనని పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. నిజానికి ఆ ప్రచారం లోనూ వాస్తవం ఉంది.

...మిగతాది 2 లో

## ఉప ముఖ్యమంత్రి పవన్ తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ భేటీ

**జయభేరి, విజయవాడ:**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ను బీజేపీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా శాలువా కప్పి, జ్ఞాపిక అందించి మాధవ్ కి పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలియచేశారు. వర్తమాన రాజకీయ అంశాలపైనా, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంపైనా వారివురూ చర్చించుకున్నారు.



## తాగుబోతు భర్తను హతమార్చిన భార్య

**- జయభేరి, రంగారెడ్డి:**

మైలార్దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. దంపతుల మధ్య ఘర్షణ హత్య కు దారితీసింది. మృతుడు షేక్ మొహమ్మద్ (30) నిత్యం మద్యం సేవిస్తూ భార్యను వేధించేవాడిగా తెలిసింది. తరచూ మద్యం మత్తు భార్యనువేధించడంతో ఆమె తట్టుకోలేక ధైర్యంగా ఎదిరించి రాయితో కొట్టి భర్తను అతి కిరాతకంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. విచారణ అనంతరం హత్య జరిగినట్లు నిర్ధారణ చేశారు. ఆరోపిత భార్యపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

## ప్రజల సేవ కోసమే టెక్నాలజీ

- ప్రజలకు ఉపయోగపడినప్పుడే సాంకేతికతకు సార్థకత
- ప్రజలకు వైద్య ఖర్చులు పెరిగిపోతున్నాయ్... భారం తగ్గించాలి
- పంటల సాగు మొదలుకుని... మార్కెటింగ్ వరకు రైతులకు అండగా నిలవాలి
- పేదలకూ నాణ్యమైన విద్య అందాలి... వారి భవిష్యత్ అందంగా ఉండాలి
- వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష.



**జయభేరి, అమరావతి, జులై 9:**

అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడైనా సరే తాను టెక్నాలజీ గురించి పదే పదే మాట్లాడేది ప్రజల కోసం.. ప్రజలకు మెరుగైన సేవలందించడం కోసమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో గేట్స్ ఫౌండేషన్ తో

...మిగతాది 2 లో

## ప్రాజెక్టు విష్ణుతో ఆర్థిక స్వావలంబన

2 లో

మొదటిపేజీ తరువాయి

## దేవుడినైనా ఎదురించి నిలబడుతం

పారుదల రంగ నిపుణులు, న్యాయ శాఖ నిపుణులు, స్టేక్ హోల్డర్స్ అందరినీ ఆహ్వానించి ఒక మంచి సానుకూల వాతావరణంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ శాశ్వత హక్కులను కాపాడుకోవడం కోసం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు వాస్తవాలు చేరవేయడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. వరద జలాలను వినియోగించుకుంటామని ఆంధ్రప్రదేశ్ వాదనను ముఖ్యమంత్రి తోసిపుచ్చారు. ముందు నికర జలాల్లో వాటా తేలాలన్నారు. నికర జలాల్లో వాటా తేలిన తర్వాత మిగులు, వరద జలాల్లో ప్రొరేటా ప్రకారం ఇరు రాష్ట్రాలకు కేటాయింపులు జరగాలన్నారు. "నీటి వాటాలో తెలంగాణ హక్కుల కోసం సంబంధిత సంస్థలు, కేంద్ర ప్రభుత్వం ముందు వాదనలు వినిపించడమే కాకుండా న్యాయస్థానాల్లో పోరాడుతున్నాం. ఈ విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి స్వయంగా సమన్వయం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే నీటి వాటాలో రాష్ట్ర హక్కులు దక్కేవి. హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కూడా నివశిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరానికి ఉమ్మడి కోటా కింద నీటి వాటా కోరి ఉంటే ఈరోజు పరిస్థితి కొంత భిన్నంగా ఉండేది. తెలంగాణ నీటిని రాయలసీమకు తరలించడం వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పనికిరాకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ రకంగా తక్కువ ధరకు లభించే విద్యుత్ విషయంలోనూ అన్యాయం జరిగింది.

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కల్వకుర్తికి నీటి కేటాయింపులను పూర్తి చేయలేదు. బీమా, నెట్టెంపాడు, నల్గొండకు గ్రావిటీతో తీసుకెళ్లే SLBC పూర్తి చేయలేదు. ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయని కారణంగా తెలంగాణకు అన్యాయం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి నదిపై 2007, 08 లో ప్రాణిహిత చేవెళ్ల (డా. బీఆర్ అంబేద్కర్ సుజల స్రవంతి) ప్రాజెక్టు తుమ్మిడిహెట్టి నుంచి ప్రాంతాన్ని, అంచనాలను, పేరును మార్చడమే కాకుండా బేసిన్ల సాకుతో రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని ఆయకట్టును తొలగించడం వల్ల నష్టం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వం 54 లక్షల ఎకరాలకు నీరిస్తే, ఎకరాకు 93 వేల రూపాయలు ఖర్చయింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం 15 లక్షల ఎకరాలకు నీరు ఇస్తే, ఎకరాకు 11.47 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. ఇలా ప్రతి విషయంలోనూ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. నీటి వాటాలకు సంబంధించిన అంశాలపై జరిగిన, జరుగుతున్న పరిణామాలపై సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వాస్తవాల ప్రాతిపదికన ఒక నివేదికను అందించారని ఈ సందర్బంగా ఉత్తమ్ కుమార్ రెడ్డికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

## ప్రజల సేవ కోసమే టెక్నాలజీ

కలిసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలోని మొదటి బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, పర్యావరణం, ఇన్ఫ్రా, ఆర్టీజీఎస్, స్వర్ణాంధ్ర విజన్2047, ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్ వంటి అంశాల్లో గేట్స్ ఫౌండేషనుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఆయా రంగాల్లో టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలకు సేవలను మరింత దగ్గర చేసే అంశంపై గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకుంటోంది. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో బిల్ గేట్స్ ఫౌండేషన్ తో కలిసి చేపడుతున్న కార్యక్రమాల ప్రగతి, పురోగతి వంటి అంశాలపై సీఎం చర్చించారు.

**టెక్నాలజీ కావాలి.. ప్రజలకు ఉపయోగపడాలి..**

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రస్తుత యుగంలో టెక్నాలజీ పెద్దఎత్తున అందుబాటులో ఉంది. టెక్నాలజీ ద్వారా చాలా వరకు పనులు త్వరితగతిన పూర్తి చేయగలుగుతున్నాం. అయితే ఆ టెక్నాలజీ ప్రజలకు ఎంతవరకు చేరువ చేయగలిగామనేదే ప్రధానం. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలందిస్తోంది. ఆగస్టు 15వ తేదీ నాటికి.. దాదాపు 95 నుంచి 97 శాతం ప్రభుత్వ సేవలు ప్రజలకు ఆన్ లైనులోనే అందుబాటులోకి వచ్చేస్తాయి. ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు.. వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా ఉంటుంది. బిల్ గేట్స్ ఫౌండేషన్ వద్ద ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో అనుసరించే విధానాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది. అలాగే టెక్నాలజీ పరంగా ఆయా అంశాల్లో ఎలా ముందుకెళ్లాలనే విషయంలోనూ వారికి నైపుణ్యం ఉంది. అందుకే వారితో కలిసి పని చేస్తున్నాం. అయితే ఆయా రంగాల్లో మనం అందిపుచ్చుకున్న సాంకేతికతను ప్రజలకు.. మరీ ముఖ్యంగా పేదలకు అందుబాటులోకి తేవాలి. టెక్నాలజీ ద్వారా ప్రజలు లాభం పొందాలి. అప్పుడే సాంకేతికతకు సార్థకత చేకూరుతుంది" అని చంద్రబాబు చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, బిల్ గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీకి నమీబియా అత్యున్నత పురస్కారం

నమీబియా ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 140కోట్ల భారతీయుల తరఫున ఈ పురస్కారాన్ని తీసుకుంటున్నట్లు చెప్పారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విదేశాల్లో 27 అవార్డులు అందుకోగా... ప్రస్తుత ఐదు దేశాల టూర్‌లో నాలుగు పురస్కారాలు అందుకున్నారు. ఆ తర్వాత ప్రెసిడెంట్ నెటుంబో నందితో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, భద్రత, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఖనిజాలు వంటి రంగాలలో పరస్పర సహకారంపై చర్చించారు. వాణిజ్యం, ఎనర్జీ, పెట్రోకెమికల్స్ వంటి అంశాలపై కీలక చర్చలు జరిపారు.

అంతేకాకుండా నాలుగు ఇరుదేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. ఇక నమీబియా పార్లమెంట్‌లో మోదీ ప్రసంగించనున్నారు. ఈ ఐదు దేశాల పర్యటనలో పార్లమెంట్‌లో మోదీ ప్రసంగించడం ఇది మూడోసారి. అంతకుముందు బ్రెజిల్ నుంచి నమీబియా చేరుకున్న మోదీకి ఘనస్వాగతం లభించింది. ఆ దేశ ప్రెసిడెంట్ నెటుంబో నంది స్వయంగా ఎయిర్ పోర్టుకు వెళ్లి మోదీని రిసీవ్ చేసుకున్నారు. 21 గన్స్‌తో కూడిన గౌరవ వందనాన్ని ప్రధాని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మోదీ స్వయంగా డప్పు వాయించి అక్కడున్నవారిని ఉత్సాహపరిచారు. కాగా ప్రధాని మోదీ బ్రెజిల్‌లో రెండు రోజుల పర్యటనను ముగించుకుని నమీబియా చేరుకున్నారు. రియో డి జనీరోలో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ఆయన హాజరై.. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియోతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అంతకుముందు ఆయన ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా దేశాల్లో పర్యటించారు.

## త్వరలో రిటైర్ అయిపోతానన్న అమిత్ షా

ఎందుకంటే.. మోదీ తర్వాత.. అంతటి స్థాయిలో రాజకీయాలు చేయగల నాయకుడిగా అమిత్ షా పేరు తెచ్చుకున్నారు. దీంతో తరచుగా అమిత్‌షా పేరు.. మోదీ తర్వాత ప్రధానిగా వినిపించింది. అయితే.. తాజాగా ఈచర్చకు, ఇలాంటి వార్తలకు ఆయ నే చెక్ పెట్టారు. తాను త్వరలోనే రిటైర్ కాబోతున్నట్టు చెప్పుకొచ్చారు. అంతేకాదు.. రిటైర్ అయిన తర్వాత.. తన జీవితం ఎలా ఉంటుందో కూడా షా వివరించారు. వేదాలు, ఉపనిషత్తులు చదవడంతోపాటు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెడతానని షా తెలిపా రు. తాజాగా సహకారసంఘాల మహిళలతో భేటీ అయిన ఆయన.. తన మనసులో మాటను చెప్పుకొచ్చారు. తాను ఎంతోకా లం రాజకీయాల్లో కొనసాగాలని భావించడం లేదని చెప్పారు. త్వరలోనే రిటైర్మెంట్ ప్రకటిస్తానని అన్నారు.

"రిటైర్మెంట్ తర్వాత వేదాలు, ఉపనిషత్తులు చదవడంతోపాటు, ప్రకృతి వ్యవసాయానికే సమయాన్ని కేటాంచాలని నిర్ణయించు కున్నా" అని తెలిపారు. కాగా.. ఆర్ ఎస్ ఎస్ నుంచి రాజకీయాల్లోకి వచ్చిన అమిత్ షా.. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన నాయకుడు. విద్యార్థి సంఘం నాయకుడిగా ఆయన ఏబీవీపీలో పనిచేశారు. బీజేపీలో చేరినతర్వాత.. ప్రధాని మోదీతో ఏర్పడిన సఖ్యతతో ఆయన.. రాష్ట్రంలోబీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అనంతరం.. హోం మంత్రిగా బాధ్యతులు చేపట్టారు. సుమారు 30 ఏళ్లుగాఆయన రాష్ట్ర, కేంద్ర మంత్రిగానే వ్యవహరిస్తుండడం గమనార్హం.

# ప్రాజెక్టు విష్ణుతో ఆర్థిక స్వావలంబన

> ఆర్థిక వ్యవస్థలో జర్మనీ దేశాన్ని పక్కన పెట్టాం. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. భవిష్యత్ కాలంలో చైనాను అధిగమించబోతున్నాం. అమెరికాకు దగ్గరగా వెళ్లబోతున్నాం.. ఆర్థికంగా ఎదగడం మాత్రమే కాదు.. రక్షణ పరంగా కూడా అంతే స్థాయిలో వృద్ధిని సాధించబోతున్నాం. ఇదేదో అడ్డగోలుగా చెబుతున్న మాట కాదు. సరదాగా చేస్తున్న వ్యాఖ్య అంతకన్నా కాదు.

ఇటీవల పాకిస్తాన్ పై ఆపరేషన్ సిందూర్ తర్వాత మన సైనిక సామర్థ్యం.. మన ఆయుధ సామర్థ్యం.. ప్రపంచానికి తెలిసింది. ముఖ్యంగా యుద్ధ విమానాలను వాడటంలో మనం ఉపయోగిస్తున్న సాంకేతికత ప్రపంచానికి సరికొత్తగా కనిపించింది. అయితే దీనిని ఇక్కడితోనే ఆపివేయాలని భారత ప్రభుత్వం అనుకోవడం లేదు. ఈ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసుకోవాలని భావిస్తున్నది. ఈ క్రమంలోనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థను భారతదేశం నిర్మించుకుంటున్నది.ఇప్పటికే డిఆర్డిఓ అత్యంత ఆధునికమైన ఆయుధాలను తయారు చేస్తున్నది. వచ్చే ఐదు సంవత్సరాలలో వివిధ రకాల 12 హైపర్ సోనిక్ యుద్ధ క్షిపణులు సిద్ధమవుతున్నాయి. ఇవి దాడి చేయడం మాత్రమే కాదు.. శత్రు దేశాల రక్షణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.

ప్రాజెక్టు విష్ణు లో భాగంగా డిఆర్డిఓ ఈ మిషన్ చేపడుతోంది.. డిఆర్డిఓ చేపడుతున్న మిషన్ లో హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్, హైపర్ సోనిక్ క్రూజ్ మిస్సైల్స్, హైపర్ సోనిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. దాడిలో అత్యంత వేగవంతమైన సామర్థ్యం.. అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానం వీటిలో ఉపయోగిస్తున్నారు. వీటి ద్వారా శత్రువులను అత్యంత బలంగా ఎదుర్కోవడం.. వెంటనే తుద ముట్టించడం వీటి లక్ష్యమని నిపుణులు చెబుతున్నారు. సరిగ్గా ఏడాది క్రితం డిఆర్డిఓ హైపర్ సోనిక్ మిస్సైల్ పరీక్షను అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా దేశ స్క్రామ్ జెట్ ఇంజన్ అభివృద్ధిలో ఇది కీలకమైన రాయిగా నిలిచింది.. అంతేకాదు ఈ వ్యవస్థలను అభివృద్ధి చేసి చైనా, రష్యా, అమెరికా స్థాయిలో భారత్ నిలిచింది. లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ కెపాసిటీ ఉన్న మోస్ట్ పవర్ఫుల్ కంట్రీస్ లో మన దేశం ఒకటిగా నిలిచింది. ధ్వని కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణించే కెపాసిటీ ఉన్న ఆయుధాలను హైపర్ సోనిక్ అని పిలుస్తుంటారు. ఇలాంటి క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశం వద్ద లేదు. అయితే ఇటువంటి అత్యాధునిక హైపర్ సోనిక్ వెపన్స్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. వీటిని ఆర్మీ, నేవీ, వాయు సేన కోసం డెవలప్ చేస్తోంది. ఇందులో ఫస్ట్ టైం ఎక్స్టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. స్క్రామ్ జెట్ ఇంజన్ తో మాక్ 8 స్పీడ్ ను రీచ్ అయ్యే విధంగా దీనిని డెవలప్ చేస్తున్నారు. ఇది



2,500 కిలోమీటర్ల వరకు ఉన్న టార్గెట్ లను చేజ్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు 2030 కల్లా వీటిని మన ఆర్మీలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఈ ఆయుధాలు మన ఆర్మీకి ఐదు సంవత్సరాల కాలంలో అందుబాటులోకి వస్తాయి. ఇవన్నీ కూడా మన దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి. అప్పుడు శత్రు దేశాలు మన మీద దాడి చేయాలంటే ఆలోచిస్తాయి. అంతేకాదు బలమైన దేశాల కంటే మనమే ముందు వరుసలో ఉంటాం. అన్నిటికంటే ముఖ్యంగా రక్షణ వ్యవస్థలో అమెరికాతో సమానంగా ఉంటాం. భారత్ ఒకప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉండేది. కానీ, ఇప్పుడు ఎగుమతిచేసే స్థాయికి ఎదిగింది. నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక రక్షణ ఎగుమతులు గణనీయంగా పుంజుకున్నాయి. గత దశాబ్దంలో దాని రక్షణ ఎగుమతులు 34 రెట్లు పెరిగి, 2024-25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయి.

పాకిస్తాన్, చైనా, టర్కీల భౌగోళిక రాజకీయ ఒత్తిడి, అమెరికా ఆయుధ సరఫరా ఖాళీలు, ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో రక్షణ ఒప్పందాలపై దృష్టి ఈ విజయానికి దోహదపడ్డాయి.భారత రక్షణ ఎగుమతుల విలువ 2013-14 నాటికి రూ.686 కోట్లు ఉండగా, 2024-25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయి, ఇది 34 రెట్ల వృద్ధిని సూచిస్తుంది. 2014 నుంచి అమలులో ఉన్న మేడిన్ ఇండియా కార్యక్రమం దేశీ ఆయుధాలను, డ్రోన్‌లను సమర్థవంతంగా గుర్తించే సామర్థ్యం, ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యూహాలను నిరోధించే లక్షణం పెంచింది. ఈ రాడార్‌ను సుఖోయ్-30ఎంకేఐ, రఫేల్, తేజస్ వంటి యుద్ధవిమానాలతో అనుసంధానం చేసే అవకాశం ఉంది. అజర్‌బైజాన్-అర్మేనియా మధ్య నాగోర్నో-కరాబాఖ్ సంఘర్షణలో అజర్‌బైజాన్‌కు టర్కీ, పాకిస్తాన్ మద్దతు ఇవ్వడంతో, భారత్ అర్మేనియాకు ఆకాశ్-1ఎస్, పినాకా రాకెట్ లాంచర్లు, స్వాతి రాడార్లు వంటి ఆయుధాలను సరఫరా చేస్తోంది.

ఈ సహకారం అజర్‌బైజాన్ యొక్క సైనిక ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, టర్కీ, పాకిస్తాన్‌లపై పరోక్షంగా ఒత్తిడి కలిగిస్తోంది. ఇదే సమయంలో 2025లో మోదీ సైప్రస్ సందర్శన, టర్కీ నియంత్రిత ఉత్తర సైప్రస్‌కు వ్యతిరేకంగా బలమైన దౌత్య సందేశాన్ని ఇచ్చింది. సైప్రస్ భారత్ యొక్క భౌగోళిక రాజకీయ వ్యూహంలో మధ్యధరా, యూరోపియన్ మార్కెట్లకు గేట్‌వేగా మారుతోంది.చైనా-తైవాన్ సంఘర్షణ నేపథ్యంలో భారత్ తైవాన్‌తో సంబంధాలను బలోపేతం చేస్తోంది. అమెరికా మద్దతుతో, భారత్ తైవాన్‌కు అండగా నిలవడం ద్వారా చైనాకు వ్యూహాత్మక ఒత్తిడి కల్పిస్తోంది, ఇది ఇండో-పసిఫిక్‌లో చైనా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది. పాకిస్తాన్, చైనా, టర్కీల శత్రుత్వం, అమెరికా ఎగుమతి ఖాళీలు భారత్‌ను స్వదేశీ రక్షణ తయారీ, ఎగుమతులపై దృష్టి పెట్టేలా చేశాయి. మోదీ విదేశీ పర్యటనలు గ్రీస్, అర్మేనియా, సైప్రస్, తైవాన్‌లతో రక్షణ ఒప్పందాల ద్వారా భారత్ యొక్క భౌగోళిక రాజకీయ ప్రభావాన్ని పెంచాయి.




# 12 నుంచి వడ్డీ లేని రుణాలు

**జయభేరి, హైదరాబాద్, జూలై 9:**

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు డ్వాక్రా మహిళలకు ప్రతి ఏడాది 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మొదటి సంవత్సరంలో 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామన్నారు. ఈనెల 12 నుంచి 18 వరకుఅన్ని నియోజకవర్గాల్లో వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయబోతున్నాం, మహిళలనీ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేద విద్యార్థులు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో కూడిన విద్యను అప్పగించడానికి ఒక్కో పాఠశాలకు 200 కోట్లు కేటాయించి 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా వచ్చింది, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ టిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ దక్కదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈనెల 12 నుంచి రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ చేస్తామని తెలిపారు. వడ్డీ లేని రుణాలతో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మహబూబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.బీఆర్ఎస్ 10 సంవత్సరాల్లో లక్ష నుంచి రెండు లక్షల కోట్ల వరకు ఖర్చుపెట్టినా రైతులకు నీళ్లు ఇవ్వలేదు.

కాళేశ్వరం ప్రాజెక్టులో వాస్తవాలు బయటికి వస్తున్నాయని వాటిని కప్పిపుచ్చుకునేందుకు టిఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ నేతలు తప్పుడు మాటలు బంద్ చేయకపోతే మొన్న పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా వచ్చింది కదా. స్థానిక సంస్థల ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో అదే సీన్ రిపీట్ అవుతుంది. సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటింటికి చేరవేస్తోంది. బీఆర్ఎస్ నేతలు అనవసరంగా ఎక్కువగా ఊహించుకుని సీఎం రేవంత్ రెడ్డిపై అవాకులు చవాకులు పేలవద్దు. సీఎం రేవంత్ రెడ్డికి బేసిన్ ల గురించి తెలియదని టిఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆయనకు బేసిన్ల గురించి అవగాహన లేకపోతే కృష్ణ, గోదావరి బేసిన్ నీళ్లను ఈ తెలంగాణ అవసరాల కోసమే వాడాలని ప్రజాభవన్ లో మొన్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో చెప్పారని గుర్తుంచుకోండి. బీఆర్ఎస్ పాలనలో నీళ్ల విషయంలో ఈ రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆధారాలతో సహా చూపించారు. బేసిన్లు లేవు, దేశజాలు లేవు. రాష్ట్రంలో ఏం జరిగినా పర్వాలేదు. కృష్ణా, గోదావరి నీళ్లు వాడుకోండని కేసిఆర్ ప్రకటన చేసిన విషయాన్ని వీడియోలతో సహా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాభవన్ లో చూపించారు.కృష్ణా, గోదావరికి బేసిన్ ప్రాజెక్టుల్లో నీళ్ల గురించి లెక్కలతో సహా చర్చించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో చర్చించడానికి సిద్ధంగా ఉంది. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని ఇప్పటికే చెప్పారు, అదే విషయాన్ని మరోసారి చెబుతున్నాం. కృష్ణ, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రతిపక్షనేత కేసీఆర్ చర్చకు రావాలని మరోసారి సవాల్ విసురుతున్నాం. లక్ష కోట్ల పైబడి సంక్షేమం కోసం ఖర్చుపెట్టామన్న వాస్తవాలను బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోవడం లేదు. రాష్ట్ర ప్రజల పట్ల బాధ్యత నిబద్ధత ఉంటే లెక్కలు తీసుకుని రండి. శాసనసభలో చర్చిద్దాం.

సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసిఆర్ కు సవాల్ విసిరితే.. ఆయన స్వీకరించలేదు. ప్రెస్ క్లబ్ కు వచ్చి సవాల్ అంటే ఎట్లా? సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేసిందేంటి. కేటీఆర్ చేస్తున్నది ఏంటి. సవాల్ స్వీకరిస్తే రాష్ట్ర ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంది. కరెంటు కోతలు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు, మీ పాలనా కాలంలో ఉన్న కరెంటు డిమాండ్ ఎంత, ప్రస్తుత కరెంటు డిమాండ్ ఎంత చర్చకు సిద్ధమా అని' డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ విసిరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 17,162 మెగావాట్ల పిక్ డిమాండ్ ఉండగా ఈ సంవత్సరం మార్చిలో అదనంగా 2000 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ వచ్చిందని వివరించారు. 2000 మెగావాట్లు అదనపు డిమాండ్ వచ్చినా కరెంటు కోతలు లేవు, రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం, రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్తు సేవలు అందుతున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 3 నెలల్లోనే ప్రజా ప్రభుత్వం 21 వేల కోట్ల రైతుల రుణమాఫీ చేసింది, రుతుపవనాలు మొదలుకాగానే 9 రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా జమ చేశాం. 10 సంవత్సరాల కాలంలో నాలుగు దఫాలుగా 25,000 చొప్పున బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లో జమ చేస్తే అవి వడ్డీకే సరిపోలేదని భట్టి విక్రమార్క అన్నారు.రైతులకు ఉచిత విద్యుత్తు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 12,500 కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం ద్వారా 50 లక్షల మంది పేదలు ప్రయోజనం పొందుతున్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేందుకు భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని నల్లమల డిక్లరేషన్ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. పోడు రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు స్ప్రింక్లర్లు, డ్రిప్పు, అవకాడో, వెదురు వంటి మొక్కలు మొత్తం ఉచితంగా అందించేందుకు 12,600 కోట్ల కేటాయించినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు.

# నకిలీ మద్యం కేసులో విమర్శలు

- నకిలీ మద్యం కేసు సిఐడికి అప్పగించాలని పరవాడ యువత డిమాండ్

జయభేరి, పరవాడ:

మండల కేంద్రం అయ్యిన పరవాడలో ఇటీవల సంచలనం రేపిన కల్తీ మద్యం కేసు పరవాడలో రాజకీయ ప్రముఖులకు ఈ కేసుకు సంబంధించి వ్యాపార లావాదేవీలు ఉన్నట్టు ప్రజలు అనుమానిస్తున్న నేపథ్యంలో సోమవారం పరవాడ యువత జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ ఇచ్చిన సమాధానం పరవాడ కేసుకు ఇతర రాష్ట్రాలతో ఉన్న లింకును బహిర్గతం చేసింది. పరవాడ నకిలీ మద్యం కేసు ఇతర రాష్ట్రాలకు లింకులు ఉండడంతో ఈ కేసును సిఐడి కి అప్పగించాలన్న డిమాండ్ కు బలం చేకూరుతుంది. అనకాపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్పీ ఇచ్చిన సమాధానం ప్రకారం వేలాది నకిలీ మద్యం నింపేందుకు సిద్ధం చేసిన 180 ఎంఎల్ బాటిల్స్ మండలంలోని నాయుడుపాలెం శివారు ప్రాంతాల్లో కుప్పలు తెప్పలుగా దర్శనమిచ్చాయి. కేవలం 50 లీటర్ల రెక్టిఫైడ్ స్పిరిట్ కోసం వేలాది క్వార్టర్ బాటిల్స్ ఎందుకు దిగుమతి చేసుకున్నారా అన్న విషయాన్ని ఎస్పీ దర్యాప్తులో తేలక పోవడం అనేక అనుమానాలను రేకెత్తిస్తుంది. విస్కీ ఫుల్ బాటిల్ లో కేవలం 42శాతం ఆల్కహాల్ ఉంటుంది. కానీ కేసు దర్యాప్తు చేస్తున్న ఎలమంచిలి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వాధీనం చేసుకున్నట్టు చెబుతున్న రెక్టిఫైడ్ స్పిరిట్ 99 శాతం ఆల్కహాల్ ను కలిగి ఉంటుంది. ఆల్కహాల్లో ఈథైల్ గ్రూపుకు చెందిన ఆల్కహాల్ను మాత్రమే త్రాగేందుకు వినియోగిస్తారు. ఇక మీథైల్ ఆల్కహాల్ను పరిశ్రమంలో వినియోగిస్తారు. నకిలీ మద్యం తయారీకి వినియోగించే రెక్టిఫైడ్ స్పిరిట్ కన్జ్యూమబుల్ నాన్ కన్జ్యూమబుల్ అన్న విషయం బహిర్గతం చేయలేదు. పరవాడ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్కు కోతవేటు దూరంలో నకిలీ మద్యం తయారీని పరిశ్రమగా ఒక ఇంట్లో నిర్వహిస్తే పోలీసులకు కనీసం వాసన తగలలేదంటే స్టేషన్లో స్పెషల్ బ్రాంచ్ ఎంతగా విఫలమైందో అర్థం చేసుకోవచ్చు. నకిలీ మద్యం కేసు బహిర్గతం అయిన వెంటనే లా అండ్ ఆర్డర్ పోలీసులు మద్యం షాపుల సేల్స్ మేన్ లకు గట్టి హెచ్చరికలే జారీ చేశారు. అయితే యాసరుపు పైడునాయుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తరువాత విడిచిపెట్టడం ఇక్కడ కూడా అనుమానాలకు తావిస్తోంది. పరవాడలో జరిగిన నకిలీ మద్యం కేసు పూర్వాపరాలపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరవాడలో విలేకరుల సమావేశం నిర్వహిస్తున్నట్లు రాత్రి ప్రకటించి ఉదయానికి ఆ ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. ఎమ్మెల్యే పై పరవాడ జన సైనికులు ఒత్తిడే దీనికి కారణంగా చెబుతున్నారు. నకిలీ మద్యం కేసులో తెలుగుదేశం నాయకులు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. నకిలీ మద్యం కేసులో అనేక అనుమానాలు ఉన్నందున సిఐడి కి కేసును అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు.







# బిగ్ బాస్కెట్ ఆన్లైన్ గ్రోసరీ స్టోర్ ని ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

జయభేరి, ఉప్పల్ :

చిల్కానగర్ డివిజన్ లోని చిల్కానగర్ కార్పొరేటర్ కార్యాలయం పక్కన రాఘవేంద్ర నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బిగ్ బాస్కెట్ ఆన్లైన్ గ్రాసరీ స్టోర్ ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మరియు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్లోని రాఘవేంద్ర నగర్ కాలనీలో బిగ్ బాస్కెట్ ఆన్లైన్ గ్రాసరీ స్టోర్ ని ప్రారంభించడం ఎంతో శుభసూచకమని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి గొప్ప ప్రాంతాలలో ఏర్పాటు చేయాల్సిన బిగ్ బాస్కెట్ స్టోర్ ని చిల్కానగర్ డివిజన్లో ఏర్పాటు చేస్తున్నారంటే ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి విశాలమైన రోడ్లు ఎక్కువ శాతం ఉద్యోగులు నివసించే ప్రాంతంగా చిల్కానగర్ డివిజన్ మారిందని, ప్రాంతం కూడా దిన దిన అభివృద్ధి చెందుతున్న విషయాన్ని తెలుసుకున్న పెద్ద పెద్ద సూపర్ మార్కెట్ ల యాజమాన్యం ఇక్కడ ఏర్పాటు చేసుకోవడం నిజంగా కూడా చాలా సంతోషదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సభ్యులు, బిగ్ బాస్కెట్ యాజమాన్యం కృష్ణ, సంతోష్ రెడ్డి మొదలగువారు పాల్గొన్నారు.





# సీసీ రోడ్ల నిర్మాణం లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

జయభేరి, హయత్ నగర్ :

హయత్ నగర్ డివిజన్లోని శారదా నగర్ కాలనిలో జరుగుతున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణా పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులతో, సంబంధిత అధికారులతో కలసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిసి రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ఏప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, బీజేపీ హయత్ నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, కార్యదర్శి మధు సుధన్, కాలనీవాసులు నర్సింహా రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ మద్యం కేసుపై ఎమ్మెల్యే పంచకర్ల స్పందించాలి

- మాజీ మండల వైస్సార్సీపీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు



జయభేరి, పరవాడ:

ఇటీవల మండల కేంద్రం అయ్యిన పరవాడలో వెలుగులోకి వచ్చిన కల్తీ మద్యం కేసుపై నేటి వరకు కూడా అధికార పార్టీ నేతలు నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుందని ఈ కేసులో అధికార పార్టీ నాయుకుల హస్తం ఉండడం వలనే మద్యం సిండికేట్లు ఒత్తిళ్లకు తలవంచి ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఎమ్మెల్యే పత్రిక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ముందు ప్రకటన ఇచ్చి తరువాత పత్రికా సమావేశం రద్దయినట్లుగా ప్రకటన ఇవ్వడం జరిగిందని ఆరోపణ చేశారు. ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్న చలగాట మాడుతున్న మద్యం సిండికేట్లు, మద్యం వ్యాపారస్తులపై తక్షణ చర్యలు తీసుకొని అలాగే ప్రజల తాలూకా ఆరోగ్యాలు కాపడాల్సిందిగా ఎమ్మెల్యేకి ప్రతిక ప్రకటన ద్వారా బొద్దపు విన్నవించుకున్నారు అలాగే తక్షణమే దీనిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి మద్యం కేసుపై సమగ్ర విచారణకు అదేశాలు ఇవ్వాలని మద్య వ్యాపారస్తులపై కొరడా జుపించాల్సిందిగా ప్రోహి బిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వారు అలసత్వం వీడే విధంగా వారిపై చర్యలు తీసుకోవాలని దీనిపై తక్షణమే అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి రాజకీయాలకు తీతంగా ప్రజల తాలూకా ఆరోగ్య విషయమై చర్చించి ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిందిగా ఎమ్మెల్యేని పరవాడ మండల వైసిపి మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు కోరారు.

# ఉచితంగా అరుదైన అయోటిక్ శస్త్ర చికిత్స

- 10 గంటల పాటు శ్రమించిన ఆసుపత్రి వైద్యులు

జయభేరి, ములుగు, జూలై 09 :

సిద్దిపేట జిల్లా లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో బుధవారం నిష్ణాతులైన వైద్య బృందం నిర్వహించిన అరుదైన అయోటిక్ శస్త్ర చికిత్స విజయవంతమైంది. మహబూబాద్ జిల్లా, కొత్తగూడ మండలం, పోగులపల్లి గ్రామానికి చెందిన బోనగిరి యాకయ్య(52) దీర్ఘకాలంగా చిన్నప్రేగు, కిడ్నీలు, రెండు కాళ్లకు గుండె నుండి వచ్చే రక్త నాళాలు బిగుసుకొని రక్తప్రసరణ నిలిచి పోయింది. ఈ క్రమంలో రోగి యాకయ్య వివిధ ప్రాంతాలలోని ప్రముఖ ఆసుపత్రులు, వైద్యులను సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోగా, చివరకు ఆర్వీఎం ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించాడు. దీంతో వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించగా, ఆసుపత్రి యాజమాన్యం అధునాతన వైద్యాన్ని అందించింది. ఈ క్రమంలో ఆసుపత్రి వైద్యులు 10 గంటల పాటు శ్రమించి అరుదైన అయోటిక్ శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శస్త్ర చికిత్సలో ప్రముఖ వైద్యులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ భరధ్వాజ్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ విజయ్ మోహన్, డాక్టర్ కిషోర్ ల బృందం పాల్గొనగా, వారి కృషితో రోగి యాకయ్య ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. ముఖ్యంగా రోగి యాకయ్య కుటుంబం పేదరికం అనుభవిస్తుండడంతో నయా పైసా తీసుకోకుండా ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించడం పట్ల రోగి కుటుంబ సభ్యులు ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనుభవజ్ఞులైన పలువురు వైద్య నిపుణులు ఈ శస్త్ర చికిత్సలో పాల్గొన్నట్లు ఆర్వియం ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ గోపికృష్ణ, సీఈవో దేవరకొండ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో రోగికి ఎలాంటి ఖర్చు లేకుండా, నయా పైసా తీసుకోకుండా ఉచితంగా ఆపరేషన్ నిర్వహించినట్లు స్పష్టం చేశారు.




# నాచారం దేవస్థానం డైరెక్టర్ కు ఘన సన్మానం

జయభేరి, గజ్వేల్, జూలై 09 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షులు ఆర్యవైశ్య సంఘం గజ్వేల్ మండల అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్ నాచారం దేవస్థానం డైరెక్టర్ గా ఎన్నికైన సందర్భంగా బుదవారం గజ్వేల్ లో ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిరు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి, నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, ఐవిఫ్ జిల్లా అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, యువజన అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్ మాట్లాడుతూ జగ్గయ్యగారి శేఖర్ రాజకీయ వ్యాపార రంగంలో రాణిస్తూ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకుని నాచారం దేవస్థానం డైరెక్టర్ గా ఎన్నికైన సందర్భంగా వారికి చిరు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు





# సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

జయభేరి, ఉప్పల్ :

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మల్లాపూర్ ఎస్వీ నగర్, బాబా నగర్ (నాచారం) రూపాయలు 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు బుధవారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీలలో డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే సిసి రోడ్లను వేయిస్తున్నామని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం లో అన్ని డివిజన్లను సమ ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధిని చేపడుతున్నమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ రూప, వర్క్ ఇన్స్పెక్టర్ రామారావు, కాలనీ అధ్యక్షులు నెమలి రవికుమార్, బీఆర్ఎస్ నేతలు వాసు గౌడ్, కుంటి కృష్ణ, శ్రీశైలం, సనాల రవి చారి, సాయికుమార్, శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కాలనీవాసులు యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# చెక్కుల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే



జయభేరి, ఉప్పల్ :

మల్లాపూర్ VNR గార్డెన్ లో ఉప్పల్ సర్కిల్ కి చెందిన 320 కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగానే ఆయన మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ ద్వారా పేదింటి వారికి దోహదపడుతుంది అని ఈ పథకం చాలా మంచి పథకం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో MRO వాణి రెడ్డి, కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, శాంతి సాయి జెన్ శేఖర్, ప్రభుదాస్, బన్నాల గీత ప్రవీణ్, BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల చెక్కుల పంపిణీ



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన దేవాలయాల బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎంజిఆర్ఐ అభయాంజనేయ స్వామి దేవాలయంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. దేవాలయాలకు చెక్కుల అమౌంట్ నీ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలుకా నగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ , మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ ,మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ పాల్గొని 55 లక్షల రూపాయల 189 చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా రిధి డెంటల్ క్లినిక్ రెండవ వార్షికోత్సవం

- ముఖ్య అతిథులగా మాజీ మేయర్ అమర్ సింగ్
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్




జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ రామ్ చంద్ కాలనీ పర్వతాపూర్ లో రిధి డెంటల్ క్లినిక్ రెండవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మేయర్ అమర్ సింగ్ కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజానికి వైద్య సేవలందించడంలో డెంటల్ క్లినిక్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా క్లినిక్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత డెంటల్, మెడికల్ చెక్అప్ శిబిరం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంపై అవగాహన పెంచే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అభినందించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ పలువురు ఈ శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. క్లినిక్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన దంత చికిత్సలతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇకపై తరచుగా నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాసారం మహేష్, మేడిపల్లి హనుమాన్ టెంపుల్ చైర్మన్ రామ్ రెడ్డి, మేడిపల్లి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు చిలుముల అజయ్ రెడ్డి, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, క్లినిక్ సిబ్బంది, ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 24 నుంచి వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్

- వైఎంసిఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి ప్రిస్ట్ లీ గైస్

**జయభేరి, హైదరాబాద్, జూలై 09:**

వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో ఈ నెల 24,25,26 తేదీల్లో 25వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరి స్పోర్ట్స్ ఫెస్టివల్ ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రిస్ట్ లీ గైస్, ప్రతినిధి బిజె వినయస్వరూప్ తెలిపారు. బుధవారం నారాయణగూడలోని వైఎంసీఏలో వారు మాట్లాడుతూ బాల బాలికలకు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీ బాల్, ఖోఖో, కబడ్డి, కరాటే, చెస్, కిక్ బాక్సింగ్, బాక్స్ క్రికెట్, మార్చ్ ఫాస్ట్ తదితర పోటీలు ఉంటాయని తెలిపారు. 17 ఏళ్ళ లోపు విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనుటకు అర్హులు. ఈనెల 22వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు సూచించారు. వివరాలకు సెల్: 7799665544, 7032660614, 9391025959.

## బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని ప్యాచ్ వర్క్ పనులను పరిశీలన

- కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి..!!!



**జయభేరి, ఎల్బీనగర్ :**

గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం వద్ద రానున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని రహదారులు పాడైపోయిన చోట్ల ప్యాచ్ వర్క్ పనులను గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రహదారులు పాడైపోయిన చోట్ల ప్యాచ్ వర్క్ పనులు నాణ్యతతో చేయాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డివిజన్ వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షులు మూర్తి యాదవ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇండ్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం



**జయభేరి, ఘట్కేసర్ :**

అర్హులందరికీ ఇండ్లు కట్టించి ఇవ్వడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని పేదలకు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్ష రూపాయలు మంజూరు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం మహోత్సవం కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మాదారం 1, అవుషాపూర్, అంకషాపూర్ గ్రామంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, పలువురు నాయకులతో కలిసి భూమి పూజ చేసినారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ మాజీ ఛైర్మెన్ మల్లి పావని జంగయ్య యాదవ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్





**జయభేరి, పరవాడ:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం మెగా పేరెంట్, టీచర్ సమావేశం నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. ఈ మీటింగ్లో విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే విషయాలపై చర్చిస్తారు. మొక్కలు నాటడం, ఆటల పోటీలు, భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డు అందజేస్తారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు ముగుస్తుంది. ఈ సమావేశంలో అనేక ఆసక్తికర అంశాలు ఉన్నాయి.ఈ సమావేశం సందర్భంగా మొక్కలు నాటడం, ఆటల పోటీలు, భోజనాలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అంతేకాదు ప్రతి విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డును కూడా అందజేస్తారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సాధ్యమ!? అసాధ్యమా!?

- పార్టీ మనుగడకు మేమే పని చేసాం..
- ఇందిరమ్మ ఇండ్లు మొత్తం మాకే కావాలి..!?
- ఎస్టీ ఎస్సీ బిసి ఎవరికి అధికారాన్ని అందిద్దాం...!?
- రోడ్డు వేస్తున్నాం కదా ఖచ్చితంగా కాంగ్రెస్ కే ఓట్లు పడతాయి..!
- సంక్షేమ పథకాలన్నీ మీకేనా!? అట్లయితే మేం కాంగ్రెస్ కు ఓటు వేయం..!?
- నిరాశ వాదుల హెచ్చరిక..




**శాలిగౌరారం మండలం ఇటుకుల పహాడ్ గ్రామంలో స్థానిక ఎన్నికల రాజకీయ ముఖచిత్రం ఎలా ఉండబోతోంది..!? త్వరలో స్థానిక ఎన్నికలు రాబోతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్రంలోనే దాదాపు 80 నియోజకవర్గంలో స్థానికంగా కాంగ్రెస్ పార్టీ అధికారం దక్కించుకుంటుందా!? అనే అంచనాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఊపందుకుంటున్నాయి.. ఈ నేపథ్యంలో నల్లగొండ జిల్లా లోని ఆయ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎలా ఉండబోతుంది ?అనే అంశంపై జయభేరి న్యూస్ సేకరించిన కథనాల ప్రకారంగా అధికారం దక్కించుకుంటుందా లేదా అన్న విషయంపై సీనియర్ జర్నలిస్ట్ కడారి శ్రీనివాస్ అందించే కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ అనే రాజకీయ సమగ్ర విశ్లేషణ ద్వారా బహిర్గతమవుతున్న అసలు నిజాలు ఏంటో మనం ఇప్పుడు చూద్దాం.**

**జయభేరి, శాలిగౌరారం:**

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది మేమే అంటూ పది సంవత్సరాలుగా చేసిన పోరాటానికి ప్రజలు నమ్మి అధికారాన్ని కట్టబెట్టారు. తెలంగాణ రాష్ట్రంలో అనూహ్యంగా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు నిర్వహించిన తర్వాత రేవంత్ రెడ్డి ముఖ్యమంత్ర? అన్న మాటలు మూత పడిపోయాయి. అవును రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రే అన్న విధంగా రేవంత్ రెడ్డి తనదైన అనుభవంతో తన గురువు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దగ్గరనుంచి నేర్చుకున్న విషయాలు తెలంగాణ రాష్ట్ర భౌగోళిక ముఖచిత్రం సామాజిక రాజకీయ పరిజ్ఞానం అంత కూడగట్టుకుని హై కమాండ్ ఆదేశాలకు అనుగుణంగా పరిపాలనను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలో కచ్చితంగా మహిళలకే భరోసా కల్పించే విధంగా వారికి కొంత నగదును అందిస్తామని చెప్పిన అది ఇంతవరకు ఒంటరి మహిళలకు అందకపోవడం ఒక మైనస్ గా కనిపిస్తోంది. ఇక విజయవంతంగా నడిచిన ఆడవాళ్లకు ఫ్రీ బస్సు సక్సెస్ అయిందని చెప్పాలి. ఆడవాళ్ళ ఓట్లు కాంగ్రెస్కు పడే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో ఏ బస్సు చూసిన మహిళలతో కీటకిటలాడిపోతుంది. ఇక భాగ్యనగరంలో ఏ బస్సు చూసిన మహిళలే... పూర్తిగా మగవారు తమ సొంత వాహనాలను పాత వాహనాలు బయటికి తీసి వాటిని బాగు చేసుకొని ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఇక ఉచిత కరెంటు రెండు వందల యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించింది. విజయవంతంగా అందించిన సంక్షేమ పథకాలు వేళ్ళ మీద లెక్క పెట్టుకునే అంతగా ఉంటే.. ఇంకా అమలుపరచని ఎన్నో సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో అందించిన వాగ్దానాలు నిరూపించుకోలేక అడుగులు తడబడుతుంది.

ఇక అనేక సర్వేలు తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికల్లో ఎవరు అధికారాన్ని దక్కించుకుంటారో అనే విషయాన్ని సర్వేల ద్వార బట్టబయలు చేస్తున్న ఈ సందర్భంగా... తెలంగాణ రాష్ట్రంలోనే అనేక నియోజకవర్గాల్లో సర్వేలు జోరుగా ఊపొందుకుంటున్నాయి. ఇక నల్గొండ జిల్లా లోని శాలిగౌరారం మండలం లో గల ఇటుకుల పహాడ్ గ్రామంలో సర్వేలు తలకిందులయ్యేలా కనిపిస్తున్నాయి. ఎందుకంటే 2000 పైచిలుకు ఓట్లు ఉన్న ఇటుకుల పహాడ్ గ్రామపంచాయతీ పరిధిలో గతంలో పనిచేసిన సర్పంచులు పూర్తిగా వ్యవసాయానికి పరిమితమై ప్రజాపాలనకు దూరంగా ఉన్నారు.

విద్యార్థులకు కావలసిన బస్సు, సౌకర్యం రోడ్డు కుల ఆదాయ సర్టిఫికెట్ల విషయంలోనే కాకుండా ఇంక అనేక మౌలిక సౌకర్యాలు వసతుల్లో కూడా గతంలో పనిచేసిన ఇక్కడి సర్పంచులు పెద్దగా పట్టించుకోలేదనేది అక్కడ ప్రజల ఆరోపణ. ఇక చివరిసారిగా సర్పంచిగా పనిచేసిన రిటైర్డ్ ఆర్మీ సర్పంచిగా ఎన్నికైన తర్వాత బాగానే కష్టపడుతూ అభివృద్ధి కోసం పాటుపడిన తాను సంక్షేమం కోసం ఖర్చు చేసిన బిల్లులు ఇంకా రాలేదని వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ తిరిగి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి దక్కించుకోవాలని ఉద్దేశంతో తహతహలాడుతున్నారు. అంతేకాకుండా ఈ గ్రామంలోని అనేకమంది ఆశావాహులు సర్పంచ్ ఎన్నికల కోసం సమాయత్తమవుతున్నారు. కొందరు ఏకంగా ఎవరింట్లో మరణం సంభవించిన వారికి 5000 రూపాయల నగదును వారికి అందిస్తున్నారు. మరొకరు ఫౌండేషన్ పేరుతో శోకంతో ఉన్నవారికి వారికి ప్రార్థిహా దేహాన్ని పెట్టే బాక్సును ఉచితంగా సేవలు అందిస్తున్నారు. ప్రజల్లో ఎలాగైనా ప్రజాభిమానాన్ని దక్కించుకోవాలని సర్పంచ్ రేసులో ఉన్న ఆశావాహులు గట్టిగానే ప్రయత్నం చేస్తున్నరు. ఇక్కడి నుంచి చాలా అనుభవం కలిగిన వారు కూడా ఎన్నోసార్లు వివిధ పోటీల్లో పాల్గొని కొద్ది అంకెల తేడాతో ఓడిపోతూ వస్తున్నారు. వాస్తవానికి ఆ గ్రామ రాజకీయ భౌగోళిక ఆర్థిక సామాజిక పలు రంగాల్లో పూర్తిగా తమకు అవగాహన ఉందంటూ పదేపదే చెప్పుకొస్తున్నరు. నిజానికి ఇక్కడ ఎక్కువ ఓట్లు షెడ్యూల్ కులాల వారికే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. కానీ షెడ్యూల్ కులాలవారు తక్కువ సార్లు సర్పంచిగా పని చేస్తూ మిగతా వారికి దాసోహం చేస్తున్నారు. అంటే కాసులకే ఓట్లు గుమ్మరించే విధంగా షెడ్యూల్ కులాలవారు మారిపోవడం రాజకీయంగా వారు అధికారాన్ని దక్కించుకోకపో వడం శాపంగా మారుతుంది. వాస్తవానికి ప్రతి ఎన్నికల్లో ఓటుకు నోటు అందించే విషయంలో ఏ పార్టీ కూడా తక్కువ ఏం కాదు.. కానీ గ్రామానికి కావలసిన రోడ్డు మంచినీరు విద్యుత్తు దవఖానాలు సర్కార్ బడి విద్యార్థులకు కావలసిన మౌలిక సంక్షేమ వసతుల గురించి ఇంతకాలం పనిచేసిన సర్పంచులు ఆలోచించిన ఆ దిశగా సక్సెస్ను అందుకోలేకపోయారు. ఊరినిండా రాజకీయ నాయకులే.. కానీ ఊరికి రోడ్డు బాగుండదు అనే సామెత నుంచి ఇప్పుడు రోడ్డు నూతనంగా రూపుదిద్దుకుంటుంది. అంటే స్థానిక ఎన్నికల మహిమే.. ఏమో కానీ మొత్తానికి రోడ్డు మాత్రం నూతనంగా రూపుదిద్దుకుంటున్న అంశాన్ని బట్టి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మద్యం ఏరులై పారుతున్న పట్టించుకున్న పాపాన ఎవరు పోవట్లేదు.

ఇటుకుల పహాడ్ గ్రామంలో యువత పూర్తిగా మద్యానికి బానిసగా మారిపోతూ అనేకచోట్ల మద్యం అమ్మకాలు జోరుగా ఊపొందుకుంటున్నాయి. గరిష్ట ధర కంటే ఎక్కువ ధరకు మందులు అమ్ముతూ ఎంచక్కా వ్యాపారం చేసుకునే వాళ్ళు కులం మత విభేదాలు లేకుండా అనతి కాలంలోనే అంచలంచెలుగా ఎదిగిపోతున్నారు. కానీ ఆ గ్రామం యొక్క యువ సంపద పూర్తిగా నశించి పోతోంది. చిన్న వయసులోనే మద్యానికి బానిసై జీవితాన్ని బలి పెట్టుకుంటున్న వాళ్ళు ఎక్కువగా దిగువ తరగతికి చెందిన వాళ్లే కావడం విశేషం.. దీనిపై ఏ అధికారి నోరు మెదపరు? ఎవ్వరు కఠిన చర్యలు తీసుకోరు? తుంగతుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మందుల సామేల్ ఎన్నికైన తర్వాత ఈ ఊరికి రోడ్డు రావడం కాంగ్రెస్ విజయంగా భావిస్తున్న మిగతా సంక్షేమ విషయంలో ప్రజలు కొద్దిగా విముఖత చూపిస్తున్నారు. ఇటుకుల పహాడ్ గ్రామానికి సంబంధించి రాజకీయ ముఖచిత్రాన్ని ఒకసారి పరిశీలిస్తే... అధిక శాతం ఓట్లు ఉన్నవారిలో షెడ్యూలు కులాలకు చెందిన ఎస్సీలు, అలాగే యాదవులు, ముదిరాజులు, గౌడ సామాజిక వర్గం... ఎస్సీ కి సంబంధించిన సర్పంచులు ఒకసారి ఎన్నికైన తర్వాత మళ్లీ ఇంతవరకు అక్కడ సర్పంచ్ గా ఎస్సీలు కానీ ఎస్టీలు గాని ఎవరు ఇంతవరకు కాలేదు. అంటే ఇక్కడ కుల వివక్ష



కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు, రచయిత, సామాజిక ఉద్యమకారులు

పూర్తిగా కనిపిస్తుందని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఈ గ్రామ ఓటర్లు మాత్రం పూర్తిగా డబ్బులు ఎవరిస్తే వారికి ఓటే విధంగా మారిపోతున్నారు అనే ఆరోపణలు ఆ నోట ఈ నోట బహిర్గతంగానే వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉంటే గత ప్రభుత్వంలో అధికారం చలాయించిన వాళ్లు అడ్డగోలుగా దోచుకున్నారు, సంక్షేమ పథకాలు వారే అనుభవించారు, అనే నెపం తోటి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ముందు నుంచి ఉన్నవాళ్లు పార్టీకి అధికారం దక్కిన తర్వాత గ్రామస్థాయిలో ఉన్న చోట మోట లీడర్లు అంచలంచలుగా ఎదుగుతున్నారు.. మండల స్థాయిలో డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. కార్యకర్తలను మర్చిపోవడం, ప్రభుత్వం అందించే సంక్షేమ విషయంలో ముందు తమకే ప్రాధాన్యతను అందిపుచ్చుకోవడం వారి వంతుగా మారుతుంది. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఇటుకుల పహాడ్ గ్రామపంచాయతీలో భారీగా అవకతవకలు..!? అసలేం జరుగుతోంది..!? ఇందిరమ్మ ఇళ్ల పంపకాల విషయంలో అసలు ఇందిరమ్మ ఇల్లు ఎవరికీ అందాలి!? గూడు సరిగా లేని వాళ్ళు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వాళ్లు షెడ్యూల్ కులాల వాళ్ళకి ఎలాంటి భూమి తన పేరు మీద లేని వాళ్ళకి ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకాలు అందాలి. కానీ ఇక్కడ జరుగుతున్నది మాత్రం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. దీనిపై నల్లగొండ జిల్లా కలెక్టర్ దగ్గర త్వరలో నివేదిక..!

శాలిగౌరారం, మండలం ఇరుకులపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు 26 ఈ గ్రామానికి అందించబడ్డాయి.. ఇక్కడ గ్రామ కమిటీ వేసుకుని వారికి వారే నిర్ణయించుకొని వేరే ఎవరికీ దక్కకుండా ఎక్కువ శాతం సంపన్నులే ఇందిరమ్మ ఇల్లు దక్కించుకున్నారు. ఎకరాల కొద్ది భూములు ఉన్నవాళ్లకే ఇందిరమ్మ ఇల్లు కట్టబెట్టుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి చేసేదేం లేక అధికారం ఉన్నవాళ్ల చేతిలో కీలుబొమ్మగా మారిపోతున్నారు అనేది ప్రజల ఆరోపణ. ఇందిరమ్మ ఇల్లు ఎవరెవరికి దక్కాయో ఇక్కడ ఆధారాలతో సహా నిరూపిస్తామంటున్నారు ఇక్కడి నిరాశవాదులు. కాంగ్రెస్ పార్టీలో నేను సీనియర్ ని అంటూ నోరు పారేసుకుని ఏకంగా తన కూతురుకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ చేయించుకున్న వారు ఒకరైతే, గతంలో మేము సర్పంచ్ గా పని చేసాం మాకొద్దా అన్నవారు మరికొందరు. పంచాయతీ ఆఫీసులో నేను గత ఎంతో కాలంగా పని చేస్తున్నాను నాకు వద్ద అంటూ ఇంకొకరు....!? ఇందిరమ్మ ఇల్లు అంటే పని చేసుకునే పలహారంలా మారిపోయింది.

ఇక ఎస్సీ ఎస్టీల గురించి పట్టించుకున్న వారు లేనే లేరు. అర కొర షెడ్యూల్ కులాల వాళ్లకు అందించి పూర్తిగా తామే కమిటీలు వేసుకొని తమకి ఇష్టం వచ్చినట్టుగా ఇందిరమ్మ ఇళ్ల పంపకాలను పంచేసుకున్నారు. ఈ విషయం ఆ నోట, ఈ నోట శాలిగౌరారం మండలం మొత్తం వ్యాపించింది. నల్లగొండ జిల్లాలో శాలిగౌరారం మండలం ఈసారి అధికారాన్ని దక్కించుకోవడం ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. అలాగే తుంగతుర్తి నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ఇలాంటి సున్నితమైన మౌలిక అంశాలు సంక్షేమ పథకాలు తమకు దక్కలేదంటూ కొందరు నిరాశ వాదాన్ని ఎత్తి పట్టుకుంటుంటే... మరికొందరు తాము దక్కించుకున్న వాటిని ఎలా కాపాడుకోవాలా? ఎమ్మెల్యే తమ వైపే ఉన్నాడా.. అన్న ఆలోచనలతో మరికొందరు తమ పార్టీని తామే బొంద పెట్టుకునే ఆలోచనలకు పదును పెడుతున్నారు. గత అనుభవం నేర్పిన పాఠం ఈ గ్రామపంచాయతీని పూర్తిగా స్థానిక ఎన్నికల్లో ప్రజలు మార్చేసుకుని నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలు నూతన ఆలోచనలతో తమ పరిపాలన కొనసాగించు కుంటారా!? లేక పాత పద్ధతిలోనే ఎవరు పైసలు ఎవరికి ఇస్తే వాళ్లకే ఓట్లు వేస్తాం అన్న ఆలోచనలతో తమ దారిద్రాన్ని పెంచి పోషించుకుంటారా..!? ముఖ్యంగా షెడ్యూల్ కులాలకు సంబంధించిన వారు ఒకసారి పునరాలోచించుకోవాలి. తమ జీవితాన్ని తామే సరిదిద్దుకోవాలి అందుకు అంబేద్కర్ అందించిన అమూల్యమైన విలువైన ఓటు హక్కును దుర్వినియోగం చేసుకున్న చూసుకోవాలి ఆ విధంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు పెంచాలి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు బడుగు బలహీనులకే అందాలి అనే ఒక వాదాన్ని బలంగా నిరక్షరాశులకు తెలియజేసే విధంగా అనేక కార్యక్రమాలు జరిపించాలి. మొత్తానికి నల్లగొండ జిల్లాలోని నియోజకవర్గాల్లో మొత్తానికి ఇదే తంతు నడుస్తున్నయి . ఇక మిగతా జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో కూడా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల విషయంలో పూర్తిగా అధికారం ఉన్నవాళ్లే తమ చేతివాటాన్ని చూపిస్తూ హస్త లాగవాన్ని ప్రదర్శిస్తున్నారు. దాంతో లబ్ధి పొందుతూ కార్యకర్తలుగా పనిచేసిన వారికి మొండి చేయి చూపిస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే ఏ స్థానిక ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ అధికారం దక్కించుకోవడం ప్రశ్నార్థకరం. ఒక శాలిగౌరారం మండలం తుంగతుర్తి నియోజకవర్గంలో పరిస్థితి ఇలా ఉంటే మిగతా ఆయన నియోజకవర్గాల్లో ఆయా మండలాల్లో మీ గ్రామాల పరిస్థితి ఏంటి అనేది మీరే ఆలోచించుకోండి.

## కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని రాస్తారోకో

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రమైన పరవాడలో దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రాస్తారోకో సబ్ స్టేషన్ జంక్షన్ వద్ద జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ స్కీం వర్కర్స్ ను రెగ్యులరైజ్ చేయాలని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడడం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ తీసుకొచ్చి భారత కార్మిక వర్గం పోరాట సాధించుకున్న హక్కులను హరించాలనే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. అంగన్వాడి, ఆశ , మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, వివో ఏ, వీఆర్ఏ లను రెగ్యులర్ చేయాలని అన్నారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులకు రోజుకు 600 రూపాయలు 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వివి రమణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం, అంగన్వాడి యూనియన్ నాయకులు రత్నం ,ఆశ యూనియన్ నాయకురాలు ఏ వరలక్ష్మి, వెన్నెల లక్ష్మి, మధ్యాహ్నం భోజన పథకం యూనియన్ నాయకురాలు కే విమల, వివో ఏ యూనియన్ నాయకులు ఎస్ వెంకటలక్ష్మి, ముఠా యూనియన్ నాయకులు సన్నీ బాబు గేదెల అప్పారావు పాల్గొన్నారు.



# న్యాయ సహాయ కేంద్రాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి




**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**
న్యాయ సహాయ కేంద్రాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయ విజ్ఞాన సదస్సు సంస్థ కార్యదర్శి వి మాధవి లత అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జయరాజు సూచనల మేరకు మాదాపూర్ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రజలకు వ్యవసాయ సంబంధిత చట్టాలు వినియోగదారుల సంక్షేమ చట్టాలు, కల్తీ విత్తనాలు వాటికి సంబంధించిన శిక్షలు అట్టి నేరాలపై శిక్షలు, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహ నిషేధ చట్టము, పర్యావరణ పరిరక్షణ చట్టాలు, ప్రోక్సో చట్టాలు, కనీస వేతన చట్టాలపై అవగాహన కల్పించారు. దైనందిన చట్టాలపై వారు అడిగిన వాటికి సమాధానాలు అందించారు.
గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ చట్ట పరిరక్షణ మద్దతు కేంద్రాన్ని ప్రారంభించారు. న్యాయ సహాయ న్యాయమూర్తి నాగరాజు న్యాయ సహాయం పొందడానికి అర్హతలు తెలియజేసి న్యాయ సహాయ సహాయ కేంద్రా నిర్వహణను తెలియజేశారు. ఈ కేంద్రంలో న్యాయ సహాయము సలహాలు అందించడానికి న్యాయ సహాయ న్యాయవాది నాగరాజు, ఈరాలాల్ మౌనిక లు సహాయం అందజేస్తారని అన్నారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముక్కెర్ల వెంకటేష్ మాదాపూర్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పర్యావరణ చట్టం తెలియజేసి మొక్కలను నాటారు. అనంతరం చీకడమామిడి గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించి బాలల హక్కులు, ర్యాగింగ్ చట్టాలు, మాదకద్రవ్యా నిషేధం వాటి దుష్ఫలితాలు, విద్యాహక్కు చట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవగాహన కల్పించారు. గ్రామంలో ఆధార్ కార్డు లేని చిన్నపిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డు నమోదు చేయుటలో వికలాంగులైన విద్యార్థులను గుర్తించి వారికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తక్యుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిక్షం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు టై బెల్టుల పంపిణీ

**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**
తుర్కపల్లి మండలం దత్తాయ పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి మాలతి చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు టై, బెల్టులు, డైరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యున్నత విద్య విద్యార్థులకు అందుతుందని తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు శ్రీధర్, లక్ష్మణ్, సి ఆర్ పి వీరస్వామి, చందర్, శీను, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొడారి సుమలత భవాని పాల్గొన్నారు.

## ఆగస్టు 14 నుంచి ఫ్రీ బస్సు

■ కండిషన్స్ అప్లై




**జయభేరి, కర్నూలు, జూలై 9:**
ఏపీలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే గత కొద్ది రోజులుగా అధ్యయనాలు, కసరత్తులు జరిపింది ఏపీ ప్రభుత్వం. ఎట్టకేలకు ప్రారంభించేందుకు సిద్ధపడింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఉచితం అనేది కాకుండా.. జిల్లాలకు పరిమితం చేయడంతో మహిళలు ఇప్పుడు షాక్ కు గురవుతున్నారు. స్వయంగా సీఎం చంద్రబాబు ఈ ప్రకటన చేయడంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కర్ణాటక తో పాటు తెలంగాణ మాదిరిగా కాకుండా ఏపీలో కేవలం జిల్లాలకే పరిమితం చేయడం విశేషం. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ప్రయాణానికి సంబంధించి.. అధ్యయనానికి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రులతో కూడిన బృందం కర్ణాటకలో ఉచిత బస్సు ప్రయాణం పథకానికి సంబంధించి అధ్యయనం చేసింది. ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. ఈ ఏడాది నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. ఉచిత ప్రయాణ పథకం పట్టాలు ఎక్కించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కానీ జిల్లాల వరకే ఈ పథకం పరిమితం చేయడం మాత్రం విమర్శలకు తావిస్తోంది.ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని భావిస్తున్నారు. కానీ వారి ఆశలపై నీళ్లు చల్లుతూ చంద్రబాబు జిల్లాలకు ఈ ఉచిత ప్రయాణ పథకం పరిమితం చేయడం విశేషం. దీనిపై విపక్షాలు సైతం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని వర్తింప చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.అయితే, ఈ ఉచిత బస్సు ప్రయాణం జిల్లాలకు మాత్రమే పరిమితమని క్లారిటీగా చెప్పేశారు. జిల్లాలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఆర్టీసీలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని సీఎం తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా ఒకటి. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం ప్రారంభిస్తారని భావించారు. కానీ, దీని సాధ్యాసాధ్యాలు, లోటుపాట్లపై ప్రభుత్వం అధ్యయనం జరిపి.. పథకాన్ని పక్కగా అమలుచేయడానికి ప్రణాళిక వేసింది. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణ పథకంపై విదివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది.

# ఏబీవీపీ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**
దేవరకొండ ఏబీవీపీ 77 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా సంఘటన కార్యదర్శి రాపాక సాయి మాట్లాడుతూ ప్రపంచంలోనే విద్యార్థుల కోసం జాతీయవాదం కోసం పనిచేస్తున్న ఏకైక అతిపెద్ద విద్యార్థు సంఘం ఏబీవీపీ అని, దేశంలో జాతీయ భావాలు విద్యార్థుల్లో నింపాలని, అలాగే కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశంలో ఉన్న విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ విద్యార్థుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న సంస్థ ఏబీవీపీ అని అన్నారు. జులై 9 1949 ఢిల్లీ యూనివర్సిటీలో కొంతమంది విద్యార్థులు తో ప్రారంభమైన విద్యార్థి సంఘం 56 లక్షల మెంబర్షిప్ తో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా కొనసాగుతుంది. జాతీయ జెండా కోసం ఈ దేశం కోసం ఎంతో మంది ఏబీవీపీ కార్యకర్తలు ప్రాణ త్యాగాలకు వెనకాడకుండా దేశం కోసం ధర్మం కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని వారు అన్నారు. జాతీయస్థాయి నుండి గ్రామీణ స్థాయి వరకు ఎక్కడ ఏ సమస్య ఉన్న అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ ముందు వరుసలో ఉండి పోరాడుతుందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా నా రక్తం నా తెలంగాణ అనే పేరుతో 20వేల యూనిట్ల రక్తదానం చేసి ఉద్యమానికి ఊపిరి పోసిందని మరియు అలాగే తెలంగాణ రణభేరి పేరు మీద విద్యార్థులందర్ని తెలంగాణ రాష్ట్రం కోసం ఏకం చేసిందని అన్నారు. వివేకానందుని మాట ఏబీవీపీ బాట మన ఉద్దేశంతో విద్యార్థులని సత్ప్రవర్తన దేశభక్తి వైపు మలుపుతున్న విద్యార్థి సంఘం ఏబీవీపీ అనిఅన్నారు. స్వామి వివేకానంద అంబేద్కర్ భగత్ సింగ్ కలలుగన్న ఆశయాల కోసం ఏబీవీపీ పని చేస్తున్న అన్నారు, ఈ దేశం కోసం జాతీయత కోసం పోరాడిన భరతమాత బిడ్డలని ఏబీవీపీ ఎప్పుడు స్మరించుకొని వారి స్ఫూర్తితో విద్యార్థుల్లో దేశభక్తి జాతీయభావన నింపడానికి ఏబీవీపీ ఉన్నప్పుడు పనిచేస్తుందని అన్నారు, మరొకసారి విద్యార్థులందరికీ 77వ జాతీయ విద్యార్థి దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ గోపీచంద్, నగర జాయింట్ సెక్రెటరీ యలమల హేమ సుందర్, నరేష్, రాకేష్, సాయి, కావ్య, శ్రావణి, శిరీష, తులసి రామ్ తదితరులు పాల్గొన్నారు.

# గోర్ బంజారాల సీతల భవానీ పండుగను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి ప్రోత్సహించాలి

■ అంగోత్ మోహన్ నాయక్, గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నల్గొండ జిల్లా అధ్యక్షులు


**జయభేరి, దేవరకొండ :**
తెలంగాణ రాష్ట్రంలోని గోర్ బంజారా గిరిజనులు తమ పాతనాటి ఆచారాలను, సాంప్రదాయాలను, ప్రకృతికి అనుసంధానమైన భక్తి ప్రవర్తనలను కొనసాగిస్తూ ప్రతి సంవత్సరం "సీతల భవానీ" లేదా "దాటుడు" పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ పండుగ గిరిజన సమాజ ఆరోగ్యం, భద్రత, ప్రకృతి సమతుల్యతకు ప్రతీకగా నిలుస్తోంది.

**పండుగ విశిష్టత..**
సీతల భవానీ తల్లి గోర్ బంజారాల దేవత. ఆమెను ఆరోగ్య రక్షకురాలిగా, బాలల జ్వరం, గుంటలు, చెవి, చర్మ వ్యాధుల నివారణదాయినిగా, శాంతియుత సమాజానికి సంకేతంగా పూజిస్తారు. ఈ పండుగలో గ్రామస్తులు కలిసి కట్టుగా తల్లి పూజ చేసి, చెరుకు మట్టితో ఏర్పాటైన మందిరం వద్ద ప్రత్యేక హారతులు ఇస్తారు. ఆడవాళ్లు వంటలు చేసి పంచుకుంటారు. తల్లి తలుపు వదిలే పద్ధతిలో గ్రామానికి సమిష్టిగా శుద్ధి కార్యక్రమాలు చేస్తారు. ఒక జీవన విధానాన్ని, ఆధ్యాత్మికతను, ప్రకృతిపట్ల గౌరవాన్ని ప్రతిబింబించే పండుగ ఇది.

**చారిత్రక నేపథ్యం..**
సీతల భవానీ పూజకు భారత చరిత్రలో వేదాల నుండి ప్రస్తావన ఉంది. అథర్వవేదంలో శీతలా దేవిని శాంతి కలిగించే మాతృశక్తిగా పేర్కొన్నారు. స్కంద పురాణంలో ఆమెను వ్యాధి నివారణ దేవతగా స్థానం ఇచ్చారు. బౌద్ధ, జైన గ్రంథాలలో కూడా శీతల మాతలను ప్రజల సంక్షేమదాయినిగా పేర్కొనడం విశేషం. ఇది సాంప్రదాయ వైద్యం, జ్ఞాన శాస్త్రం, ప్రజల జీవనశైలికి అనుసంధానమై ఉంది.

**ప్రాంతీయ విస్తరణ..**
ఈ పండుగ కేవలం తెలంగాణలోనే కాదు.. మహారాష్ట్రలో జాగతా దేవీ జాత్రా, గుజరాత్ లో సితలాదేవి వంతలి పూజ, ఉత్తరప్రదేశ్ లో శీతల మాత శీతలా అష్టమి, తెలంగాణలో సీతల భవానీ దాటుడు.. ప్రతి రాష్ట్రంలో ఇది ఒక గిరిజన జీవన విధానం లాంటి ఆచారంగా కొనసాగుతుంది. సామాజిక దృష్టిలో విలువ ఆరోగ్య పరిరక్షణ ప్రజలకు వ్యాధుల నుండి రక్షణకు చింతామణిగా తల్లి పూజ. సామాజిక ఐక్యత గ్రామస్థులంతా ఒకచోట కలిసి, సామూహిక వంటలు చేసి, పంచుకునే ఆనవాయితీ. ప్రకృతి పరిరక్షణ: చెట్లకు, బావులకు పూజలు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు ఉదాహరణ.





**స్త్రీ సాధికారత:** మహిళలు ప్రధాన పాత్రధారులు కావడం ద్వారా మహిళా కేంద్రిత పండుగగా నిలుస్తోంది.

**ప్రభుత్వానికి విజ్ఞప్తి...**
ఈ చారిత్రక, సాంస్కృతిక పండుగను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, క్రింది చర్యలు చేపట్టాలి. "సీతల భవానీ పండుగ" ను రాష్ట్ర పండుగల జాబితాలో చేర్చాలి. గోర్ బంజారాల గ్రామాల్లో పండుగ సందర్భంగా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పత్రికా ప్రచారం, సంస్కృతి పరిరక్షణ కోసం కార్యక్రమాలు చేపట్టాలి. పాఠశాలలలో ఈ పండుగ చరిత్రపై అవగాహన పాఠ్యాంశంగా చేర్చాలి. గిరిజన ప్రాంతాల్లో స్థానిక దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. "సీతల భవానీ (దాటుడు)" పండుగ ఒక ప్రాచీన గిరిజన మత పరంపర, ఒక ఆరోగ్య సంస్కృతి, ఒక ప్రజా ఉద్యమం, ఒక ప్రకృతి పూజా విధానం. ఇది కేవలం గోర్ బంజారాల పండుగ మాత్రమే కాదు – ఇది భారతీయ గిరిజన సమాజ జీవన ధార. ఈ పండుగను గుర్తించి, పరిరక్షించాలంటే ప్రభుత్వం, మీడియా, విద్యా వ్యవస్థ మరియు మేధావులు కలిసికట్టుగా పని చేయాలి అని తెలియజేసినారు.



## బీర్ల ఐలయ్య పై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నాం

**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**
బీర్ల ఐలయ్య పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు వల్లపు రమేష్ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పై మతిభ్రమించి సోషల్ మీడియాలో మెసేజ్లు, వీడియోలు పెట్టడం సరికాదని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి అనేకమంది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారని, ఆడబిడ్డ పిల్లలకు ఆర్థిక సహాయం అందజేశారని అన్నారు. పిల్లల చదువుల కోసం అనేకమంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసిన ఘనత ఆయనదని అన్నారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను, నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ అందజేశారని అన్నారు. ఆలేరులో 10 సంవత్సరాలు అగ్రకులాల ఎమ్మెల్యే ఉంటే ఏనాడూ వారిని ప్రశ్నించలేదు కానీ ఓబీసీ నాయకుడు సేవలు చేస్తుంటే ఓర్వలేక అతనిపై అనేక అసత్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఇంకొక్కసారి ఐలయ్య పై అణుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అన్నారు. ఈ కాంగ్రెస్ నాయకులు నరేందర్, జహంగీర్ పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గమ్మ పండుగ



**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**
తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో దుర్గమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య, గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పెండెం రవి, మండల ఉపాధ్యక్షుడు కసిర బోయిన బాలయ్య, ప్రధాన కార్యదర్శి దుగ్యాల రవికుమార్, గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామ్ మూర్తి లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**
తుర్కపల్లి మండలంలో మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన మరో కిరణాలు రిపోర్టర్ పుట్ట ఆంజనేయులు తండ్రి పుట్ట ఐలయ్య మరణించడంతో పాటు మాదాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు జాలిగామ రాజు తల్లి మరణించడంతో రెండు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ భూక్యా సుశీల రవీందర్ నాయక్, మాజీ ఎంపీటీసీలు పలుగుల నవీన్ కుమార్, గిద్దె కరుణాకర్, సాగర్ల పరమేష్ యాదవ్, నల్ల శ్రీకాంత్ , గుంటి శ్రీశైలం, రాజేష్ నాయక్ బద్దు నాయక్, మోతీరాం నాయక్, మేకల బాలకృష్ణ, లచ్చి రామ్ నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా శక్తి సంబరాలు





**జయభేరి, తుర్కపల్లి, జూలై 09 :**
తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమైక్యలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఈ కార్యక్రమంలో సెర్ప్ వసంత సేన, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జంగారెడ్డి, డిపిఎంలు రవీందర్, ప్రభాకర్, జిల్లా ఎపిఎం మల్లేష్, మండల ఏపీఎం యాదగిరి, సీసీలు పరశురాం, శివకుమార్లు పాల్గొన్నారు. అనంతరం ఎన్ ఐ ఆర్ డి ఆధ్వర్యంలో త్రిపుర రాష్ట్రం నుంచి వచ్చిన బ్యాంక్ మేనేజర్ల సమూహం ఎస్ హెచ్ జి సభ్యులతో సమావేశం నిర్వహించారు.




# ముచ్చటగా మూడోసారి

అగ్ర కథానాయిక రష్మిక మందన్న కెరీర్‌లో 'పుష్ప' సిరీస్ చిత్రాలు చాలా ప్రత్యేకం. శ్రీవల్లి పాత్ర ఆమెకు దేశవ్యాప్తంగా తిరుగులేని ఫాలోయింగ్‌ను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా మాస్ ప్రేక్షకులకు ఆ క్యారెక్టర్ బాగా రీచ్ అయింది. కథానాయకుడు పుష్పరాజ్‌తో సమానంగా శ్రీవల్లి పాత్ర పాపులర్ అయిందనడం అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో ఈ సూపర్‌హిట్ కాంబో మరోసారి రిపీట్ కాబోతున్నదని సమాచారం. అల్లు అర్జున్‌తో రష్మిక మందన్న ముచ్చటగా మూడోసారి జోడీకట్టబోతున్నదని ప్రచారం జరుగుతున్నది. వివరాల్లోకి వెళితే..అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో భారీ పాన్ వరల్డ్ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. సైన్స్ ఫిక్షన్ కథాంశమిదని సమాచారం. భారీ వ్యయంతో సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నెలలోనే సెట్స్‌మీదకు వెళ్లనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో రష్మిక మందన్నను కథానాయికగా ఖరారు చేయబోతున్నారని తెలిసింది. 'పుష్ప' సిరీస్ చిత్రాలతో బన్నీ, రష్మిక మందన్న హిట్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకోవడంతో..అదే సెంటిమెంట్‌ను కొనసాగించాలన్నది మేకర్స్ ఆలోచనగా చెబుతున్నారు. ప్రస్తుతం ఈ వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది.

# మాస్ అవతార్ 'బ్యాడాస్'



టిల్లు పాత్ర సిద్ధు జొన్నలగడ్డకు యూత్‌లో మంచి క్రేజ్‌ని తీసుకొచ్చింది. 'డీజే టిల్లు' 'టిల్లు స్క్వేర్' చిత్రాలు భారీ హిట్స్‌గా నిలిచాయి. సిద్ధు జొన్నలగడ్డతో ఈ రెండు చిత్రాలను నిర్మించిన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తాజాగా ఆయనతో 'బ్యాడాస్' పేరుతో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టింది. రవికాంత్ పేరేపు దర్శకత్వం వహిస్తారు. బుధవారం టైటిల్‌ను రివీల్ చేయడంతో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. 'ఇఫ్ మిడిల్ ఫింగర్ వాజ్ ఏ మ్యాన్' అనే బోల్డ్ స్టేట్‌మెంట్‌తో పోస్టర్ ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ మునుపెన్నడూ చూడని మాస్ అవతారంలో కనిపిస్తారని, పరిణితితో కూడిన పాత్ర ఇదని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, రచన: రవికాంత్ పేరేపు, సిద్ధు జొన్నలగడ్డ, దర్శకత్వం: రవికాంత్ పేరేపు.



# కానీ ఆ పాట దేశాన్నే ఊపేసింది..

ఇండస్ట్రీలో ప్రస్తుతం చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా సినిమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే ఎన్నో పాన్ ఇండియా సినిమాలు రిలీజ్ అయ్యి భారీ కలెక్షన్స్ సొంతం చేసుకుంటున్నాయి. చిన్న సినిమాలు కూడా ఊహించని విజయాలను అందుకుంటున్నాయి. అలాగే కొన్ని సినిమాలు భారీ అంచనాలు మధ్య విడుదలై దారుణంగా నిరాశపరుస్తున్నాయి. ఇప్పటికే భారీ హైప్ తో వచ్చిన సినిమాలు డిజాస్టర్స్‌గా నిలిచిన సినిమాలు బోలెడన్ని ఉన్నాయి. అయితే ఈ సినిమా మాత్రం మరీ దారుణం.. రూ. 80 కోట్ల బడ్జెట్ పెట్టి సినిమా తీశారు. ప్రమోషన్స్ కూడా భారీగానే చేశారు. కానీ రిలీజ్ తర్వాత సినిమా దారుణంగా ఫ్లాప్ అయ్యింది. మొదటి రోజే డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. ఇంతకూ ఆ సినిమా ఏదో తెలుసా.? ఈ సినిమా మాత్రం రూ. 80 కోట్ల బడ్జెట్ తీస్తే.. రూ. 8 కోట్లు కూడా రాబట్టలేకపోయింది. ఈ మధ్యకాలంలో ఇంత దారుణమైన సినిమా రాలేదనే చెప్పాలి. అయితే ఈ సినిమా టాలీవుడ్ సినిమా కాదు. ఇది బాలీవుడ్ సినిమా. ఈ సినిమా పేరు ఆజాద్. ఈ సినిమాలో స్టార్ కాస్టింగ్ ఉంది. పైగా హీరో, హీరోయిన్ కూడా స్టార్ కిడ్స్. బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవ్‌గన్ సోదరుడి కుమారుడు అమన్ దేవ్‌గన్ హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. అలాగే హీరోయిన్‌గా రవీనా టాండన్ కూతురు రాషా తదాని డెబ్యూ చేసింది. ఈ సినిమాలో సీనియర్ నటుడు అజయ్ దేవ్‌గన్ సైతం కీలక పాత్ర పోషించాడు. రూ. 80కోట్లు బడ్జెట్ పెట్టి సినిమా తీస్తే రూ. 8 కోట్లు కూడా రాబట్టలేకపోయింది. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్ దగ్గర నుంచి టీజర్స్, ట్రైలర్, సాంగ్స్ సినిమా పై హైప్ క్రియేట్ చేసింది. కానీ రిలీజ్ రోజే సినిమా డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. ఏం సినిమారా బాబూ..! జనాలు తలలు పట్టుకునేల చేసింది ఈ మూవీ. ఇక ఈ సినిమాలో ఉయ్ అమ్మా అనే సాంగ్ మాత్రం దేశాన్ని ఊపేసింది. ఇప్పటికీ ఈ సాంగ్ ట్రెండింగ్ లో దూసుకుపోతుంది.



# అందంలో అప్సరస..

ప్రస్తుతం తెలుగు సినీరంగంలో సరైన సక్సెస్ కోసం వెయిట్ చేస్తున్న హీరోయిన్లలో నభా నటేష్ ఒకరు. కెరీర్ తొలి నాళ్లల్లో వరుస హిట్స్ అందుకుంటూ ఫుల్ ఫాంలో దూసుకుపోయింది. దీంతో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో స్టార్ హీరోయిన్ అవుతుందని అనుకున్నారు అంతా. కానీ అలా జరగలేదు. స్టార్ హీరోయిన్ అవ్వాల్సిన ఈ హీరోయిన్.. అనుహ్యంగా ఇండస్ట్రీకి దూరమయ్యింది. తెలుగులో వరుస ఫ్లాపులతో సతమతమయ్యింది. చివరకు ఇండస్ట్రీ నుంచి దూరం అయ్యింది. కానీ కన్నడలో వరుస ఛాన్సులు అందుకుంది. ప్రస్తుతం తెలుగుతోపాటు తమిళం, కన్నడ భాషలలో నటిస్తుంది. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే యాక్సిడెంట్ జరగడంతో ఇండస్ట్రీకి దూరమైపోయింది. ఇప్పుడు వరుస సినిమాలతో అలరిస్తుంది. ప్రస్తుతం నిఖిల్ సరసన స్వయంభు చిత్రంలో నటిస్తుంది. ఇందులో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా తప్ప మరో సినిమా లేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం క్రేజీ ఫోటోషూట్స్ షేర్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. చీరకట్టులో మతిపోగొట్టే ఫోజులతో నెట్టింట మాయ చేస్తుంది ఈ ముద్దుగుమ్మ. అయితే ప్రస్తుతం ఇండస్ట్రీలో చిన్న చిన్న సినిమాలతో అలరిస్తున్న అమ్మడుకు తెలుగులో ఆఫర్స్ మాత్రం రావడం లేదు. తెలుగులో ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్టు అందుకున్నప్పటికీ ఇప్పటివరకు ఈ బ్యూటీ ఖాతాలో సరైన బ్రేక్ మాత్రం రాలేదు. ఇప్పుడు ఈ అమ్మడు ఆఫర్స్ కోసం ఎదురుచూస్తుంది.

# జబర్దస్త్‌లోకి మళ్లీ నాగబాబు 12 ఏళ్ల తర్వాత గ్రాండ్ రీఎంట్రీ




బుల్లితెర కామెడీ షో జబర్దస్త్ కార్యక్రమం ప్రేక్షకులకి ఎంత వినోదం పంచుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికీ ఈ షో సక్సెస్‌ఫుల్‌గానే నడుస్తుంది. అయితే అప్పట్లో ఈ షోకి నాగబాబు, రోజా జడ్జ్‌లుగా ఉన్న విషయం తెలిసిందే. మెగా బ్రదర్ నాగబాబు జబర్దస్త్ షో నుంచి తప్పుకుని చాలా కాలమే అయింది. ఆయనతో పాటు రోజా కూడా వెళ్లిపోయిన తర్వాత, జబర్దస్త్‌కి పర్మనెంట్ జడ్జిలులేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో మేనేజ్‌మెంట్ తాత్కాలికంగా మనో, ఖుష్బూ లాంటి సెలబ్రిటీలను జడ్జిలుగా పెట్టి షోను నడిపిస్తున్నారు. దీంతో షో పాపులారిటీ కొంత మేర తగ్గిపోయిందన్న అభిప్రాయాలు ఉన్నాయి.

జబర్దస్త్ టీమ్‌తో నాగబాబుకి విభేదాలు రాగా, ఆయన మరో ఛానెల్‌కి వెళ్లి కొత్తగా కామెడీ షో ప్రారంభించినా, అది ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అయితే ఇప్పుడు మళ్లీ ఆయన అదే జబర్దస్త్ వేదికపై గ్రాండ్ రీ ఎంట్రీ ఇస్తున్నారు. జబర్దస్త్ షో ప్రారంభమైన 12 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, మల్లెమాల ఎంటర్టైన్మెంట్స్ ఓ స్పెషల్ సెలబ్రేషన్ ప్లాన్ చేసింది. దీనికోసం రిలీజ్ చేసిన ప్రోమో ఇప్పటికే వైరల్ అవుతోంది. ఈ ప్రత్యేక ఎపిసోడ్‌లో చమ్మక్ చంద్ర, అదిరే అభి లాంటి ప్రముఖ కమెడియన్లు హాజరై సందడి చేయనున్నారు. హైపర్ ఆది, అనసూయలతో పాటు మిగతా పాపులర్ ఆర్టిస్టులు కూడా రచ్చ రచ్చ చేస్తున్నారు.

నాగబాబు రీఎంట్రీతో అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆయన రీ ఎంట్రీకి సంబంధించిన ప్రోమోలో 'ఓజీ' సినిమాలోని "అలాంటోడు మళ్లీ తిరిగి వస్తున్నాడు అంటే" అనే డైలాగ్ ప్లే చేస్తూ, జబర్దస్త్ యూనిట్ గ్రాండ్ వెల్కమ్ చెప్పింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో యాంకర్‌గా జబర్దస్త్‌కు వెలుగు తెచ్చిన అనసూయ కూడా ఈ స్పెషల్ ఎపిసోడ్‌లో కనిపించనున్నారు. చాలా రోజుల తర్వాత అనసూయ, నాగబాబు, ఇతర సీనియర్ కమెడియన్లు ఒకే వేదికపై కనిపించబోతుండటంతో, ఫ్యాన్స్ ఎగిరి గంతేస్తున్నారు. ఇప్పటికైతే నాగబాబు షోకు కేవలం గెస్ట్ జడ్జిగా మాత్రమే వచ్చారని సమాచారం. 12 ఇయర్స్ సెలబ్రేషన్ ఎపిసోడ్ కోసం స్పెషల్ అపీరియన్స్ మాత్రమే ఇచ్చారని టాక్. ప్రస్తుతం నాగబాబు రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314.** email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com